రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 29లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల రెండవ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

ఎంఫార్మసీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) (ఆల్ స్పెషలైజేషన్స్) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 2లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చేనెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ (ఐఎస్) రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 26 నుంచి, మాస్టర్స్ డిగ్రీ ఇన్ పోలీస్ మేనేజ్మెంట్ వన్ టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల 5 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వివరాలను ఓయూ వెబ్సైట్‌లో చూసుకోవాలన్నారు.

హామీలను అమలు చేయాల్సిందే..

- మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం ఇవ్వాలి..
- పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్ల బిల్లులు, వేతన బకాయిలు చెల్లించాలి..
- గ్యాస్‌ను ప్రతి పాఠశాలకు ఉచితంగా సరఫరా చేయాలి
- హామీలను అమలు చేయకపోతే కార్మికులతో కలసి ఆందోళన..
- ఇందిరాపార్కు వద్ద ధర్నాలో యూనియన్ నాయకులు

ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి రమ

కవాడిగూడ, మార్చి 24: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పదివేలు కనీస వేతనం అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ)అధ్యక్షురాలు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి రమలు ఆరోపించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేనట్లయితే కార్మికులతో కలసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పదివేలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ)అధ్యక్షురాలు స్వప్న, ప్రధాన కార్యదర్శి రమలు మాట్లాడుతూ.. మహిళల అకౌంట్లలో రూ.2500 వేస్తామని చెప్పి మోసం చేసారన్నారు. ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారెంటీలు ఇచ్చి అందులో గృహజ్యోతి పథకాన్ని సక్రమంగా అమలు చేయడంలేదన్నారు. 8 నెలలుగా కోడిగుడ్ల బిల్లులు, మూడు నెలల వేతన బకాయిలు చెల్లించడంలేదని ఆరోపించారు. వంటకు అవసరమైన గ్యాస్‌ను ప్రతి పాఠశాలకు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. కార్మికుల వేతన పెంపు కోసం బడ్జెట్ కేటాయించి, ఎన్నికల హామీ ప్రకారం కార్మికులకు పదివేల రూపాయలు వ్యక్తిగత ఖాతాలలో వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్ల బిల్లులు, వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే మధ్యాహ్న భోజన కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ధర్నాకు హాజరై మద్దతు ప్రకటించారు. యూనియన్ నాయకులు సుల్తాన్, పద్మ, కృష్ణమాచారి, మాయ, లక్ష్మి, ఉన్ని కృష్ణ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి

బేగంపేట్, మార్చి 24 : ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం చూపొద్దని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్, మోండా, బన్సీలాల్‌పేట డివిజన్‌లకు చెందిన 7మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.94 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఆర్థిక సమస్యల కారణంగా చికిత్స చేయించుకోవడంలేదని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యం పొందాలని కోరారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం కోసం తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సనత్‌నగర్, మోండా డివిజన్‌ల అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, ఆకుల హరికృష్ణ, నాగులు, మహేశ్ యాదవ్, లక్ష్మీపతి, వెంకట్‌బాబు ఉన్నారు.

ఓయూ సర్క్యులర్ రద్దుకు మద్దతు ఇవ్వండి ..

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో అన్ని రకాల ఆందోళనలు, నిరసనలను నిషేధిస్తూ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని విద్యార్థి నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్‌లను కలిసి పరిస్థితిని వివరించారు. అనంతరం విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగ నియమాలకు విరుద్ధంగా జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకునే విధంగా ప్రభుత్వం, ఓయూ అధికారులతో మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు నాగేశ్వరరావు, జంగిలి దర్శన్, కాసర్ల మధు, వలిగొండ నరసింహ, జంగయ్య, మహేశ్, నవీన్, రుద్ర వరం మధు, సైదులు, వంశీ, రుక్మత్ పాషా, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనను వాయిదా వేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: దక్షిణ భారతదేశ రాజకీయ అస్థిత్వాన్ని దెబ్బతీస్తున్న పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనను 25 ఏళ్లు వాయిదా వేయాలని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. తక్షణమే హైదరాబాద్‌ను దేశ రెండవ రాజధానిగా ప్రకటించాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్, ఇతర విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఆయన సోమవారం నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం ఢిల్లీ కంటే అన్ని రకాలుగా మెరుగైన నగరమని 1955లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారని గుర్తు చేశారు. శత్రుదేశాలకు దూరంగా ఉండటంతో పాటు రక్షణ, వాతావరణం పరంగా మెరుగైన నగరం అని వివరించారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు దమ్ముంటే ఉత్తరాదికి చెందిన ప్రధాని, హోంమంత్రులను ఒప్పించి హైదరాబాద్‌ను దేశ రెండవ రాజధానిగా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం విద్యార్థులకు కల్పించిన వాక్ స్వాతంత్రాన్ని ఓయూలో కాపాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఓయూ అధికారులు జారీచేసిన నియంతృత్వ సర్క్యులర్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

4, 5లలో ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలను వచ్చే నెల 4, 5 తేదీల్లో ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. క్లాసికల్ డ్యాన్స్, గ్రూప్ డ్యాన్స్, గ్రూప్ సాంగ్స్, ఆన్ ద స్పాట్ పెయింటింగ్, తదితర అంశాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు వచ్చే నెల రెండవ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయి


డాక్టర్ మహేంద్రకుమార్ రెడ్డికి వైద్య సేవారత్న జాతీయ పురస్కారంను అందజేస్తున్న మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్, జస్టిస్ చంద్రయ్య

చిక్కడపల్లి, మార్చి 24: సమాజంలో వివిధ సేవలందిస్తూ పురస్కారాలు అందుకున్నవారికి మరింత బాధ్యతను పెంచుతాయని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. సర్వేజనా సుఖినోభవంతు సంస్థ 8వ వార్షికోత్సవం, ఉగాది పండుగ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి.. వారికి సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవా స్వర్ణనంది, విశ్వాసు ఉగాది జాతీయ స్థాయి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ చంద్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యరంగంలో విశిష్ట సేవలందిస్తున్న లయన్స్ ఇంటర్నేషనల్, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, డిస్ట్రిక్ట్ 320-ఏ లయన్ డాక్టర్ మహేంద్ర కుమార్‌రెడ్డికి వైద్య సేవా రత్న జాతీయ పురస్కారంను అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మందడి కృష్ణారెడ్డి, కూచిపూడి నాటి గురువు భారతి, లయన్ నైనా దేవి, ఉమా శంకర్ రెడ్డి, కృష్ణాది శేషు, తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

బొల్లారం, మార్చి 24: కంటోన్మెంట్‌లోని డిఫెన్స్, సివిల్ ఏవియేషన్ లాండ్స్‌లో నివసిస్తున్న సుమారు 11 వేల కుటుంబాలకు కనీస సౌకర్యాలు లేవనే విషయంపై సోమవారం ఎమ్మెల్యే శ్రీగణేశ్ అసెంబ్లీలో లేవనెత్తారు. సుమారు 11 వేల కుటుంబాలు కనీస వసతులకు కూడా నోచుకోక పలు సమసస్యలతో జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు. డిఫెన్స్ లాండ్స్‌లో ఉన్న సాయిబాబా హట్స్, చిన్న కమేలా, నందమూరి నగర్, మర్డ్ ఫోర్డ్ హట్స్,108 బజార్, సెంట్రల్ బాటరీ, రెడ్డి కాంపౌండ్ సివిల్ ఏవియేషన్ లాండ్ లో ఉన్న అన్నానగర్, రసూల్ పుర, ఇందిరమ్మ నగర్, శ్రీలంక బస్తీలలో కనీస మౌలిక వసతులు కూడా లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం

చిక్కడపల్లి, మార్చి 24: మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందని వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. బాగ్ లింగంపల్లి యూనియన్ కార్యాలయంలో ముస్లిం కార్మికులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంజీవరెడ్డి ముస్లిం కార్మికులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ బీజీఎం శివకుమార్, డాక్టర్ విక్రమ్ సింగ్, ఆనంద్ కుమార్, యూనియన్ నాయకులు కె.రాజు, పాల్, శ్రీనివాస్ యాదవ్ ,నగేశ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ ప్రారంభించిన ప్రిన్సిపాల్ ఇందిర, సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి

క్షయ వ్యాధి నివారణ మనందరి బాధ్యత

బన్సీలాల్‌పేట, మార్చి 24 : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గాంధీ వైద్య కళాశాలలో మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నివారణకు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడమే మార్గమని అన్నారు. ప్రతి సంవత్సరం మార్చి 24న ప్రపంచ క్షయ నివారణ దినోత్సవంగా పాటిస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి అంటువ్యాధి అని రోగి దగ్గినప్పుడు మైక్రో బ్యాక్టీరియం ట్యూబెరిక్లోసిస్ అనే క్రిమి గాలిలో వ్యాపించడంతో ఇతరులకు వ్యాధిసోకే అవకాశం ఉందన్నారు. సకాలంలో వైద్యం తీసుకోవడంతో పాటు కోర్సును క్రమం తప్పకుండా తీసుకుంటే క్షయ వ్యాధిని అరికట్టవచ్చని అన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ వ్యాధికి మందులు, పరీక్షలు, చికిత్స ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సురేఖ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పూజ, డాక్టర్ స్వాతి, ఎంపీహెచ్ ఈ ఓ వేణుగోపాల్ గౌడ్, ఫారుక్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి..

అమీర్‌పేట, మార్చి 24 : శరీరంలో రోగ నిరోధక శక్తి బలహీనపడినప్పుడు ఏర్పడే ఇన్ఫెక్షన్లలో ముఖ్యమైనవి టీబీ, హెచ్ఐవీలని అమీర్‌పేట హాస్టల్ ప్రైమ్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కొల్లా బత్తుల రత్నబాబు అన్నారు. ఈ రెండింటిలో ఏ వ్యాధి వచ్చినా రెండవ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మామూలుగానే హెచ్ఐవీ వల్ల వ్యక్తిలో రోగనిరోధక శక్తి బాగా తగ్గుతుందని, దీని కారణంగా శరీరంలో చోటు చేసుకునే మరిన్ని మార్పులతో టీబీ కూడా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఏకకాలంలో ఈ రెండు సమస్యలతో బాధపడుతున్నవారిని ఇటీవల కాలంలో ఎక్కువగా చూస్తున్నామని తెలిపారు. సోమవారం జరిగిన ప్రపంచ టీబీ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని అమీర్‌పేట హాస్టల్ ప్రైమ్ ఆసుపత్రిలో రోగులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ రత్నబాబు మాట్లాడుతూ.. ఇటీవల అంతర్జాతీయ పత్రికల్లో ఏకకాలంలో సంభవించే రెండు వ్యాధులను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవచ్చని అంశాలను రోగులతో పంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవీ, టీబీ ఉన్న వారిలో మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని, అందువల్ల హెచ్ఐవీ ఉన్న ప్రతి వారికి టీబీ పరీక్ష తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. పరీక్షలో టీబీ ఉన్నట్టు తేలితే, కొన్ని అదనపు పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణను కచ్చితంగా చేపట్టవచ్చని, ఆ విధంగా సకాలంలో వైద్యం అందించడం ద్వారా పరిస్థితుల్లో మార్పులుతేవచ్చు అని అన్నారు.

'రైటింగ్ స్కిల్స్ ఫర్ ప్రొఫెషనల్ గ్రోత్'పై సర్టిఫికెట్ కోర్సు

ముషీరాబాద్, మార్చి 24: విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో రైటింగ్ స్కిల్స్ ఫర్ ప్రొఫెషనల్ గ్రోత్ అనే అంశంపై నిర్వహిస్తున్న 30 రోజుల సర్టిఫికెట్ కోర్సు ప్రారంభ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. ప్రభు పాల్గొని మాట్లాడుతూ.. సృజనాత్మకతతో రాయడం ముఖ్యమైనదని, నైపుణ్యం వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు, విజయవంతమైన ఉద్యోగ జీవితాన్ని కొనసాగించవచ్చని అన్నారు. జర్నలిజం, రచనా రంగంలో రాణించవచ్చని, సర్టిఫికెట్ పొందడంతో పాటు సామాజిక బాధ్యత కూడా విద్యార్థులకు అలవడుతుందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆంగ్లశాఖ అధ్యక్షుడు కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెంకట ఈశ్వర్, లావణ్య, డా.ముక్త వాణి, రాజశేఖర్, డా.అనురాధ, డా.బాణాల శ్రీనివాస్, డా.యాదగిరి, నీరజ, వీరాల సంతోషి, ఇర్ఫాన్ బేగం, తస్నీమ్ జహాన, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ..

మారేడ్ పల్లి, మార్చి 24 : రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందనడానికి ఎంఎంటీఎస్ రైల్లో యువతిపై జరిగిన లైంగిక దాడి యత్నం ఘటన నిదర్శనమని పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఎంఎంటీఎస్ రైల్లో అత్యాచార యత్నానికి గురై రన్నింగ్ రైలులోనుంచి దూకి తీవ్ర గాయాలపాలైన యువతికి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రి నుండి సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామా రావు పటేల్, పాల్వాయి హరీశ్ బాబు, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డిలు గాయపడిన యువతిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..రాష్ట్రంలో పాలన గాడి తప్పిం దని 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు హోంమంత్రి లేకపోవ డం ఇలాంటి ఘటనలకు నిదర్శనమన్నారు.

సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి - టీకే శివప్రసాద్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ అంటేనే ఉద్యమాల గడ్డ, ఉద్యమానికి ఊపిరి, యావత్ విద్యార్థి లోకానికి ఉద్యమ స్ఫూర్తి అని తెలంగాణ నవనిర్మాణ విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు టీకే శివప్రసాద్ అన్నారు. అంతటి ఘనత కలిగిన ఉస్మానియా గడ్డ ప్రశ్నించే హక్కును అణచివేస్తామనుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. సర్క్యులర్‌కు వ్యతిరేకంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విద్యార్థి సేన ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ.. ఆనాడు వందేమాతరం ఉద్యమానికి పురుడు పోసింది, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందుండి నడిపించింది ఉస్మానియా యూనివర్సిటీ యేనని గుర్తు చేశారు. విద్యార్థులకు చదువుతోపాటు ప్రశ్నించే తత్వాన్ని నేర్పించి అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్న గడ్డ ఉస్మానియా అని కొనియాడారు. వర్సిటీ యాజమాన్యం చేసే తప్పుడు పనులను కప్పిపుచ్చుకునేందుకు విద్యార్థుల గొంతులకు ఆనకట్ట వేస్తున్నారని మండిపడ్డారు. యూనివర్సిటీ అభివృద్ధి గురించి ఆలోచించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. వర్సిటీలోని సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడాలని హితవు పలికారు. సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, మార్చి 24: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. రాంనగర్ డివిజన్‌లోని రిసాల కుర్షిద్ బస్తీలో సమస్యలపై స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం ఎమ్మెల్యే.. వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్ రాజు, మేనేజర్ శివసాయి, సూపర్‌వైజర్ గౌస్, జీహెచ్ఎంసీ గీత, ఏఈ మురళి, సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన నూతన వీడీసీసీ రోడ్డు, స్ట్రీట్ లైట్, డ్రైనేజ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, ముక్తార్ హుస్సేన్, ముదిగొండ మురళి, ఎర్రం శేఖర్, ప్రవీణ్ ముదిరాజ్, ఇలామ్ హుస్సేన్, పూస గోరక్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలు..

వేంకటేశ్వరస్వామి రెండవ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, మార్చి 24: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. భోలక్‌పూర్‌లోని సంజీవ హనుమాన్ దేవాలయంలో వేంకటేశ్వరస్వామి రెండవ వార్షిక మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జయసింహ, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బింగి నవీన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్కండేయ, కార్యదర్శులు పుండరీకం, గడ్డం నవీన్, వెంకటేశ్, ఆంజనేయులు, ముచ్చకుర్తి ప్రభాకర్, కృష్ణమూర్తి, వినోద్, కృష్ణ , భక్తులు పాల్గొన్నారు.

ఐక్యతను చాటుతున్న ఇఫ్తార్..

కవాడిగూడ, మార్చి 24: రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గుల్షన్‌నగర్‌లోని అంజుమన్ హాల్‌లో స్థానికులు అబ్దుల్ సమద్, షఫీయుద్దీన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ..ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందును ప్రారంభించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జయసింహా, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, నాయకులు అక్లాక్‌హుస్సేన్, షరీఫ్, చాంద్, కాంగ్రెస్ నాయకుడు మసూద్, ఎస్ఐలు లక్ష్మీపతి, రాజేశ్, డీఎస్ఐ చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన నేర నియంత్రణకు చర్యలు

నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో భద్రతా చర్యలపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

బొల్లారం, మార్చి 24: సమర్థవంతమైన నేర నియంత్రణకు, సురక్షితమైన వాణిజ్య వాతావరణాన్ని ప్రోత్సహించడానికి పోలీసుల సహకారంతో మార్కెట్ యార్డులో తక్షణ చర్యలు తీసుకోవాలని నార్త్‌జోన్ డీ